క్లుప్తంగా

ఆటపాటలతో అంగన్‌వాడీల సందడి



బహుమతులు అందిస్తున్న అధికారులు

కంభం: స్థానిక తెలుగు వీధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆటపాటలతో గురువారం సందడి చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా లెమన్ అండ్ స్పూన్, కుర్చీల ఆటలు ఆడారు. స్త్రీశక్తి, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. ఆటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగ చెంచు లక్ష్మీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మార్కాపురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం సాయంత్రం మార్కాపురం పట్టణ శివార్లలోని సెయింటాన్స్ స్కూల్ సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి కే చిన్నకాశిరెడ్డి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఒంగోలు వైపునుంచి వస్తున్న వాహనం టూవీలర్‌ను ఢీకొట్టడంతో కాశిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

చీమకుర్తి రూరల్: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవోలు నరసింహారావు, శివాజి పేర్కొన్నారు. గురువారం మండలంలో పడమటి నాయుడు పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవోలు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సరైన బోధనా పద్ధతులతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. అనంతరం 1,2 తరగతుల విద్యార్థులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు

మద్దిపాడు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు వాణిజ్య వ్యాపారులకు లావాదేవీలు నిర్వహించడానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు నందిపాడు సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సహకార సంఘం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు వాణిజ్య కార్యకలాపాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు శనగలు తదితర పంటలను రైతులు వద్ద గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. సహకార సంఘాల్లో రికార్డులను కంప్యూటరీకరణ చేస్తామన్నారు. సీఈవో రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు విరివిగా డిపాజిట్లు చేసుకుంటే అధిక వడ్డీ అందిస్తామన్నారు. ప్రతి రైతుకు సంఘం ద్వారా దీర్ఘకాలిక రుణాలు అందజేస్తామన్నారు. పాత సభ్యత్వాలు కలిగిన వారు రూ. 330 రుసుము కట్టి రూ.10 వేలు డిపాజిట్ చేసుకుంటే ఓటు హక్కు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10న నరసరావుపేటలో రాష్ట్ర సదస్సు

చీమకుర్తి: సావిత్రిబాయి పూలే వర్ధంతి రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండని కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలో రాష్ట్రసదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 10న నరసరావుపేటలో కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి అందరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జంగాల కోటేశ్వరరావు, కేఎన్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు మహిళలకు ఉచిత వైద్య శిబిరం

కొత్తపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు కెనరా బ్యాంక్ కొత్తపట్నం శాఖ, ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని శ్రీరాం వెంకట రంగంశెట్టి కల్యాణ మండపంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కొత్తపట్నం కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ విక్రమ్ తెలిపారు. అనుభవం గల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాధ (ప్రసూతి, స్త్రీలు, సంతానలేమి, లాప్రోస్కోపిక్ వైద్య నిపుణులు), డాక్టర్ వి.జయవర్దన్ (ఎండ్రోక్రైనాలజీ వైద్య నిపుణులు), డాక్టర్ పి.ధనలక్ష్మి పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి ఆపరేషన్ అవసరమైతే కొంత రాయితీతో చేయించనున్నట్లు చెప్పారు. కొత్తపట్నం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పేద మహిళలు వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.



నిర్మాణం పూర్తయిన హెల్త్ సెంటర్



ప్రారంభానికి నోచుకోని రైతు సేవా కేంద్రం

ప్రభుత్వ భవనాలపై
కూటమి కక్ష

- పశువుల దొడ్డిగా హెల్త్ సెంటర్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కేతగుడిపి సచివాలయం
- గాలికొదిలేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు



చిల్లచెట్ల మధ్య సచివాలయ భవనం

తర్లుపాడు: గత ఐదేళ్లలో గ్రామాల్లో సేవలందించడానికి సచివాయలయాను తీసుకొచ్చి విజయవంతంగా పాలన చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. అధికారం మారిన తర్వాత నేడు కూటమికి కన్నుకుట్టి సచివాలయాలను నిర్వీర్యం చేసింది. ప్రజలకు సేవలందించేందుకు గ్రామాల్లో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే గతేడాది మార్చి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనాలను పలుచోట్ల ప్రారంభించ లేదు. ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భవనాలకు గ్రహణం పట్టింది. లక్షల రూపాయలు వెచ్చించి కట్టిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇందుకు ఉదాహరణగా మండలంలోని కేతగుడిపి పంచాయతీలో సుమారు రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రైతుసేవా కేంద్రం, హెల్త్ సెంటర్ నిర్మించారు. ఇందులో కేవలం విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ పనులు మాత్రమే పూర్తి కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణాలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న చర్యల్లో భాగంగా ఈ గ్రామంలో 90 శాతం నిర్మాణం పూర్తయిన భవనాలపై కూడా నిర్లక్ష్యం వహించింది. దీనితో ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. హెల్త్ సెంటర్ భవనం పశువుల దొడ్డిగా మారగా, సచివాలయం చిల్లచెట్లకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ప్రస్తుతం గ్రామంలో పంచాయతీ భవనంలో సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు.



పశువుల పేడతో నిండిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

కూటమి ప్రభుత్వం ఈ భవనాలను పూర్తిచేసి ప్రారంభిస్తే ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందటంతోపాటు పనిచేసే ఉద్యోగులకు కూడా రక్షణ ఉంటుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణం



రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుల వారు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవీ భూదేవీ సమేత అమలక లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో 62వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణం ఆలయ అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో పండితులు, వేదపండితులు కిశోర్, అర్చక బృందం కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు డీవీ కృష్ణారెడ్డి, జి వెంకటరెడ్డి, వై సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, యోగిరెడ్డి, మహిలా కమిటీ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

అధ్వానంగా గోవిందపల్లె దారి..



కల్వర్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

కొమరోలు: మండలంలోని గోవిందపల్లె గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొట్టిపల్లి గ్రామం బాట నుంచి గోవిందపల్లె గ్రామానికి సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కానీ రహదారిపై కల్వర్టు ప్రాంతంలో రహదారి ఛిద్రమై పెద్ద రాళ్లు తేలుతూ ఉండడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టుపై రాళ్లు నిలిచి ప్రమాదకరంగా ఉంది. వాహనాలు ఆప్రాంతంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గోవిందపల్లె, పొట్టిపల్లె రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పది పరీక్షలకు అధికారుల నియామకం

రాచర్ల: పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లను, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియామించారని ఎంఈవో శివకోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా షేక్.గౌస్‌బాషా, డీవోగా ఏవీ రఘురామ్, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రానికి చీఫ్‌గా ఎంవీ.సుబ్బారెడ్డి, డీవోగా బీ.జయకర్, ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి చీఫ్‌గా ఈ.వెంకటేశ్వర్లు, డీవోగా జి.విజయరాజులను నియమించిట్లు ఆయన తెలిపారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..

పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా ఎంఈవో తెలిపారు. మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్న పబ్లిక్ పరీక్షలకు మండలంలో 423 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వివరించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లుగా తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లను, అధికారులను నియమించి వారికి పరీక్ష శిక్షణ ఇచ్చామన్నారు. అంతేకాక 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చనని తెలియజేశారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాలలో నిర్మాణంలో ఉన్న నూతన అంగన్ వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా నిలిచాయి. మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో 72 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 25 ప్రభుత్వ భవనాలు కాగా 28 అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. 19 మాత్రం పలు ప్రభుత్వ కార్యాయాల్లో ఏర్పాటు చేశారు. కాగా గతంలో నాడు-నేడు ద్వారా గొట్లగట్టు, నాగరాజుకుంట, పుట్లూరివారిపల్లి గ్రామాల్లో రూ.13 లక్షల మేర నిధులు మంజూరు చేయటంతో నూతన కేంద్రాల భవనాల నిర్మాణం చేపట్టారు. పనులు కొంత మేర పూర్తయినప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణం పూర్తిగా ఆగిపోవటంతో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం అర్థాతరంగా నిలిచిపోవటంతో భవనాల చుట్టూ చిల్లచెట్లు పెరిగిపోయాయి. పలు చోట్ల కేంద్రాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినప్పటికి అవికూడా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.



గొట్లగట్టులో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనం



పేరారెడ్డిపల్లిలో నిలిచిన అదనపు గదుల భవనం

అలాగే పలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అదనపు గదుల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. ఆయా గ్రామాలలో నిర్మించిన భవనాలకు తలుపులు, కిటికీలు, ప్లాస్టింగ్, నేల బండలు వేయకుండా వదిలేయటంతో భవనాలు మందుబాబులకు నిలయంగా మారాయని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేసి వాటిలో చిన్నారులకు విద్యను కొనసాగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో గల సర్వ సిద్ధి వినాయకుడి ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు గురువారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వినాయకుడి మహిమల విశిష్టతలను గురించి భక్తులకు వివరించారు. దంపతులు వేదమంత్రోచ్చరణాల మధ్య సామూహికంగా యజ్ఞం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటుగా పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

పోలీస్ స్టేషన్‌కు కెమెరాలు అందజేత

పొదిలి: మండలంలోని ఓబులక్కపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అవుల వెంకట సుబ్బారెడ్డి, పోలీస్ స్టేషన్‌కు రూ.50 వేల విలువైన సీసీ కెమెరాలను సమకూర్చారు. ఈమేరకు గురువారం ఎస్సై వేమనకు స్టేషన్‌లో 12 కెమెరాలు అందజేశారు. అంతకు ముందుగా సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సర్కిల్ కార్యాలయం ఆధునికీకరణకు విరాళం అందించినందులకు సీఐ చేతుల మీదుగా మెమొంటో అందుకున్నారు. కార్యాలయానికి విరాళం ఇవ్వడంతో పాటు, సీసీ కెమెరాలు అందించిన సుబ్బారెడ్డిని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన కృతజ్ఞతలు తెలిపారు.



ఎస్సైకి కెమెరాలు అందజేస్తున్న సుబ్బారెడ్డి

పొలాల్లో అగ్ని ప్రమాదం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

తర్లుపాడు: గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి ఆర్పకుండా పడేయడంతో కంది పంట దగ్ధమైంది. ఈఘటన మండల కేంద్రం తర్లుపాడు గ్రామ శివార్లలో గురువారం పొలాల్లో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. రైతులు సీ నరసింహా, జి వెలుగొండయ్యలకు చెందిన పొలాల్లో కంది, మిర్చి, పొగాకు సాగుచేశారు. గురువారం గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి ఆర్పకుండా పడేయడంతో కోసి పక్కన పెట్టిన కందికి నిప్పంటుకుంది. పక్కనే ఉన్న మిర్చి, పొగాకు పంటలు కూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న కంభం ఫైర్ ఆఫీసరు పిచ్చయ్య చౌదరి తన సిబ్బందితో మంటలను అదుపుచేశారు. కాగా మోటార్లు, నీటి పైపులు, విద్యుత్ వైర్లు అగ్నికి ఆహుతయ్యాయి. చేతికంది వచ్చిన పంటలు కాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పొలాల్లో ఉన్న ఎండుగడ్డి కూడా దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు వాపోయారు.



తగులబడుతున్న మిర్చి

ప్రభుత్వమే మెడికల్ కళాశాల నిర్మించాలి

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిన పది మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వమే పూర్తి చేసి నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దగ్గుబాటి సోమయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కాపురంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మంజూరైన మెడికల్ కళాశాల పనులు చాలావరకూ పూర్తయ్యాయని, పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పేరుతో అర్ధాంతరంగా నిలిపివేయడం మంచిది కాదన్నారు. డాక్టర్లను కూడా బదిలీ చేశారని వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించినట్లుగా పీపీపీ పేరుతో కాకుండా ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్వహించాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



విద్యుత్ సంఘం నాయకులతో ఉద్యోగులు

మార్కాపురం టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ 1104 నాయకులు టీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కార్మికులతో జరిపిన సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సభ్యులు యూనియన్ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, ప్రతాప్, రవిశంకర్, మల్లిఖార్జునరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. అనంతరం పలువురు సభ్యులను యూనియన్‌లో చేర్చుకున్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన శిక్ష

బేస్తవారిపేట: నాటుసార తయారు చేస్తే 8 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తామని కంభం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎస్ కొండారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోనపల్లెలో నవోదయం 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గిరిజన గూడెం ప్రజలు నాటుసారా రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.